సాక్షి జగిత్యాల

శనివారం । 23 । నవంబర్ । 2024

వణికిస్తున్న చలి

• జిల్లాలో 12 డిగ్రీల సెల్సియస్ నమోదు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. 12 నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌స్థాయిలో కొనసాగుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం చలి తీవ్రత పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు ఎండపల్లి మండలం గుల్లకోట, కథలాపూర్ మండలకేంద్రంలో 12.7, పెగడపల్లి, మల్లాపూర్ మండల కేంద్రాల్లో 12.8, బీర్‌పూర్ మండలం కొల్వాయి, మల్యాలలో 12.9 డిగ్రీల సెల్సియస్ చొప్పున అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



న్యూస్‌రీల్

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు



వివరాలు తెలుసుకుంటున్న బీఎస్.లత

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టొద్దని ఆడిషనల్ కలెక్టర్ బీఎస్.లత పేర్కొన్నారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల, నిర్వహణ, తేమశాతం, తూకం విధానం, మిల్లులకు తరలించిన బస్తాల వివరాలకు సంబంధించిన రికార్డులను ఈ సందర్భంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు క్రమపద్ధతి ప్రకారం రిజిష్టర్లలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని రోడ్లమీద ఆరబెట్టడం కారణంగా వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, డీటీసీఎస్ ఉమాపతి, ఆర్‌ఐ సురేశ్, ఐకేపీ ఏపీఎం దేవరాజ్, సీసీ రాజు పాల్గొన్నారు.

డీఈవోగా రాము.. జగన్మోహన్‌రెడ్డి బదిలీ



రాము, డీఈవో

జగిత్యాల: జగిత్యాల డీఈవోగా రామును నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటనర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాము మూడు నెలల క్రితమే జగిత్యాల విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైనప్పటికీ జనగామ జిల్లాకు ఫుల్ అడిషనల్ చార్జ్ డీఈవోగా వెళ్లారు. ప్రస్తుతం తిరిగి ఫుల్ అడిషనల్ చార్జ్ డీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



కోర్టుకు హాజరైన రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర రైతు ఐక్యవేదిక నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు పెట్టిన ఓ కేసు విచారణలో భాగంగా శుక్రవారం రైతులతో పాటు, రైతు నాయకులు జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేపట్టిన రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నాలు, ఆందోళనలు చేపడితే కేసులు పెట్టి వేధించిందన్నారు. ఇప్పుడు ఆ కేసుల్లో విచారణలో భాగంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి కోర్టులకు తిరగాల్సి వస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కోర్టుకు హాజరైన వారిలో జిల్లా రైతు నాయకులు రాంరెడ్డి, గంగారెడ్డి, సాగర్‌రావు, భూమరెడ్డి, మల్లయ్య, రత్నాకర్, విక్రమ్‌రెడ్డి, జనార్దన్, గోపాల్, శ్యామ్‌సుందర్, ముత్యం, మల్లేశం, సత్తయ్య, శృతిక్ ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మమత

జగిత్యాల: తెలంగాణలో జాతీయ హెల్త్ మిషన్ విభాగంలో రెండో ఏఎన్‌ఎంలుగా గత 18ఏళ్లుగా సేవలందిస్తున్న వారికి ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షురాలు పడాల మమత జాతీయ వైద్య మిషన్ కేంద్ర సహాయ కార్యదర్శి సరోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా పదేళ్లకు పైగా రెండో ఏఎన్‌ఎంలు జాతీయ వైద్య మిషన్‌లో వివిధ రకాల సేవలందిస్తున్నారన్నారు. వీరిని రోస్టర్ ప్రకారం సీనియారిటీని పరిగణలోకి తీసుకుని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సెకండ్ ఏఎన్‌ఎంలు పరీక్షలో పోటీ పడలేరని, డాక్టర్ల మాదిరిగానే ఎలాంటి పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

అంతా నా ఇష్టం!

జగిత్యాల బల్దియాలో రెవెన్యూ విభాగం అధికారి ఇష్టారాజ్యం

- విధులకు రాడు.. ప్రజలకు అందుబాటులో ఉండడు
- ఫలితంగా కదలని ఫైళ్లు.. కానరాని క్రమశిక్షణ చర్యలు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఉన్నతాధికారులు మెమో ఇచ్చినా మారని తీరు



జగిత్యాల:

నిత్యం వార్తల్లో నిలిచే జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజా సమస్యలు పరిష్కరించి, ఫైళ్లను పరిశీలించాల్సిన అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారు. సర్కారు సొమ్మును వేతనంగా తీసుకుంటూ విధులకు డుమ్మా కొడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలోనే కీలకమైన రెవెన్యూ విభాగానికి చెందిన ఓ అధికారి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతున్నాడు. విధులకు ఎగనామం పెడుతూ.. తరుచూ సెలవుల్లో వెళ్తున్నాడు. తీరు మార్చుకోవాలని ఉన్నతాధికారులు మెమో జారీ చేసినా.. సదరు అధికారి 'అంతా నా ఇష్టం' అన్నట్లు వ్యవహరిస్తుండడం బల్దియాలో చర్చనీయాంశం అవుతోంది. రెవెన్యూ పాలనకు అడ్డంకిగా మారుతోంది.

కీలకం.. రెవెన్యూ విభాగం..

- మున్సిపాలిటీలో ప్రధాన విభాగం రెవెన్యూ డిపార్ట్‌మెంట్. ప్రజలకు సంబంధించిన మ్యుటేషన్లు, ఇంటి నంబర్ల మార్పు, ఆస్తి బదిలీ, నూతనంగా ఇంటి నంబర్లు ఇవ్వడం ఈ విభాగం నుంచే జరిగే ప్రక్రియ.
- జగిత్యాల మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో పనిచేసిన ఆర్వో అధికారి ఓ భూ కబ్జా యత్నం కేసులో సస్పెండయ్యాడు. దీంతో అందులోనే మేనేజర్‌గా పనిచేస్తున్న మరో అధికారికి రెవెన్యూ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు.
- సదరు అధికారి తరుచూ సెలవులో ఉండడంతో ప్రజలకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. మ్యానువల్‌గా సుమారు 200కు పైగా, ఆన్‌లైన్‌లో 15నుంచి 20 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.
- ఎంతో కొంత అప్పగిస్తేనే తప్ప ఫైళ్లు ముందుకు కదలడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మ్యుటేషన్లు, ఆస్తిబదిలీ, ఇంటి నంబర్లకు సంబంధించిన ఫైల్లు క్లియర్‌గా ఉన్నా.. ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది.
- ఇతర విభాగాల్లో మాదిరిగా కాకుండా ఆర్వోకు డిజిటల్ కీ లాగిన్ అవకాశం ఉంటుంది. దీంతో ఉన్నతాధికారులు సైతం ఈ అధికారి లేనిదే సదరు విభాగంలో ఏం చేయడానికి వీలు లేదు.

పరిశీలిస్తున్నాం



రెవెన్యూ విభాగంలో మ్యుటేషన్లు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. సదరు అధికారి సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. విధులకు సక్రమంగా హాజరు కావాలని మెమో సైతం జారీ చేశాం. త్వరలోనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ , జగిత్యాల

- ఫైళ్లను కమిషనర్ క్లియర్ చేయాలన్నా సంబంధిత అధికారే లాగిన్ కావాల్సి ఉంటుంది. సదరు అధికారి సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రజలకు సంకటంగా మారుతోంది.

మూడు నెలలుగా ఇదే గోస

జగిత్యాల బల్దియాలోని రెవెన్యూ విభాగం అవినీతిమయమైంది. గతంలో ఆర్వోగా పని చేసిన అధికారి మూడుమాసాల క్రితం కేసులో ఇరుక్కుని సస్పెండ్ అయ్యాడు. ఆ బాధ్యతలు చేపట్టిన మేనేజర్‌స్థాయి అధికారి సరిగా అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మ్యుటేషన్లు, ఇంటి నంబర్లు, ఆస్తిబదిలీ, అసెస్మెంట్‌కాపీల కోసం దరఖాస్తు చేసుకుంటున్న పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరొకరికి బాధ్యతలు ఇవ్వాలని కోరుతున్నారు. సదరు అధికారి కారణంగా కీలకమైన రెవెన్యూ విభాగం అస్తవ్యస్తంగా తయారైందని, ఉన్నతాధికారులు స్పందించి ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెంచాలి

• కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల నమోదు కార్యక్రమం వందశాతం పూర్తి చేయాలని సూచించారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి గర్భిణులను మొదటి త్రైమాసికంలోనే నమోదు చేసి, మార్గదర్శనం చేస్తూ సేవలందించాలన్నారు. వైద్యాధికారులు ప్రతీవారం పీహెచ్‌సీల్లో సమావేశం నిర్వహించి డెలివరీలపై సమీక్ష జరపాలన్నారు. పుట్టిన పిల్లలందరికీ వందశాతం టీకాలు వేయించాలన్నారు. ఆయుష్మాన్‌భవ కార్డుల జనరేషన్ నమోదు చేయాలన్నారు. జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బాధితులను గుర్తించి కోలుకునేలా వైద్యం అందించాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, అర్చన, జైపాల్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

సర్వే డాటా ఎంట్రీ పరిశీలన

గొల్లపల్లి: గొల్లపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని శుక్రవారం కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ డాటా ఎంట్రీని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏవైనా సాంకేతిక లోపాలు వస్తే సంబంధిత నిపుణులతో సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరణ్, ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గోదావరి మహాహారతిని విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కో-కన్వీనర్ రాం సుధాకర్, తదితరులు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో ఈనెల 30న నిర్వహించనున్న గోదావరి మహాహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ రాష్ట్ర కో-కన్వీనర్ దామెర రాంసుధాకర్ పిలుపునిచ్చారు. ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం గోదావరి మహా హారతి కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. రాంసుధాకర్ మాట్లాడుతూ..ధర్మపురిపవిత్ర గోదావరిలో లోక కల్యాణార్థం గత 13ఏళ్లనుంచి బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం గోదావరి తీరంలోని మంగలిగడ్డ ఘాట్ వద్ద పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు భారీ ఎత్తును తరలిరావాలని కోరారు. పాలెపు భరత్‌శర్మ, పిల్లి శ్రీనివాస్, సంగి నర్సయ్య, కస్తూరి రాజన్న, బెజ్జారపు లవన్‌కుమార్, భాస్కర్, వైకుంఠం పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నాం

- 10 నెలల్లోనే సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభించాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పనుల పునః ప్రారంభం పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు పనులు చేపడతామని హామీ ఇచ్చామని, 10 నెలల్లోనే పనులు ప్రారంభించామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం కలిగోట గ్రామశివారులో సూరమ్మ ప్రాజెక్టు వద్ద శుక్రవారం పనుల పునః ప్రారంభం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ సూరమ్మ ప్రాజెక్టు పనులు చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతీ నెల 22న ఆందోళనలు చేశామని, అదే 22వ తేదీన తాము పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సూరమ్మ ప్రాజెక్టు వద్ద పదేళ్ల తట్టెడు మట్టి తీయలేదని మండిపడ్డారు. ప్రాజెక్టు పనుల్లో నష్టపోయే ప్రతీ రైతును ఆదుకుంటామని, రైతులు పనులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ సంతు ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు కల్లెడ గంగాధర్, ఎండీ.అజీం, తొట్ల అంజయ్య, హరిప్రసాద్, వంగ మహేశ్, చిన్నారెడ్డి, వాకిటి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే 95.51శాతం పూర్తి



వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

జగిత్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా సాగుతోంది. జిల్లాలోని 20 మండలాల్లో 2,53,191 కుటుంబాలు, మున్సిపాలిటీల్లో 83,935 కుటుంబాలు ఉన్నాయి. మండలాల్లో 2,43,919 కుటుంబాల సర్వే పూర్తి అయ్యింది. 9,272 కుటుంబాల సర్వే మిగిలి ఉంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 73,069 కుటుంబాల సర్వే పూర్తి అయింది. 5,866 కుటుంబాల సర్వే మిగిలి ఉంది. ఇప్పటి వరకు మండలాల్లో 96.34శాతం సర్వే పూర్తికాగా, మున్సిపాలిటీల్లో 93.01శాతం పూర్తి అయ్యింది. మొత్తంగా 3,37,126 కుటుంబాలుండగా, 3,21,988 కుటుంబ సర్వే పూర్తి కాగా, ఇంకా 15,138 కుటుంబాల సర్వే మిగిలింది. 95.51శాతంగా నమోదైంది.

రైతులు పత్తి సాగును పెంచాలి

• ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : రైతులు వరితో పాటు పత్తిసాగును పెంచాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఎండపల్లి మండలం కొత్తపేటలోని శాతవాహన జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర వెచ్చించి కొనుగోలు చేస్తోందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కోరారు. ఎటువంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలు కోసం కేటాయించిన ఏకైక జిన్నింగ్ మిల్ కొత్తపేట కావడం విశేషమన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక, వైస్‌చైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

34 చర్చ్‌లకు రూ.68లక్షలు

ధర్మపురి: క్రైస్తవులు చర్చిలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 34 చర్చ్‌లకు రూ.68లక్షల వర్క్ ఆర్డర్ పత్రాలు పంపిణీ చేశారు. ఒక్కో చర్చ్ అభివృద్ధికి రూ.2లక్షల చొప్పున మైనార్టీ వెల్ఫేర్ ద్వారా నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

- ర్యాగింగ్ చట్టరీత్యా నేరం
- ఎస్పీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాలక్రైం: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యా సంస్థల్లో యాంటి ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్‌ను కట్టడి చేయాలని సూచించారు. ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం మంచి విద్యార్థుల లక్షణం కాదన్నారు. సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. ర్యాగింగ్ నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారి వివరాలను డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, సీఐ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సయ్యద్ సాయిఫ్ ఉల్లా ఖాద్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్తీక స్నానాలు

ధర్మపురి: కార్తీక శుక్రవారం సందర్భంగా ధర్మపురి గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మొదట గంగమ్మ, గౌరమ్మలకు మొక్కులు చెల్లించి గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో పూజలు చేసి, స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయానికి ఒక్కరోజు రూ.2,18,709 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

తాకట్టు వ్యాపారం

- జిల్లాకేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన ఓ వ్యక్తి సాధారణ ప్రజల నుంచి వాహనాలు, బంగారం, భూమి డాక్యుమెంట్లు తాకట్టు పెట్టుకుని రూ.10 నుంచి రూ.15 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాడు. వడ్డీకి డబ్బులు తీసుకున్న వ్యక్తుల నుంచి ఓపెన్ చెక్కులు, తెల్లపేపర్లపై సంతకాలు కూడా తీసుకుంటున్నాడు. ఒకవేళ చెల్లించనిపక్షంలో వాహనం మార్పు చేసుకునేందుకు ఫారం 29, 30పై సంతకాలు తీసుకుంటున్నాడు.
- మెట్‌పల్లి పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బంగారం తాకట్టు పెట్టుకుని సుమారు రూ.5 కోట్ల మేర అప్పులిచ్చాడు. అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాడు. సకాలంలో అప్పు చెల్లించని వారి బంగారాన్ని జప్తు చేస్తూ జోరుగా వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు.
- జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌కు చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, కార్ల రిజిస్ట్రేషన్ పత్రాలు తాకట్టు పెట్టుకుని సుమారు రూ.2 కోట్ల మేర అప్పు ఇచ్చాడు. వారికి నూటికి రూ.10 నుంచి రూ.15 వడ్డీ వసూలు చేస్తున్నాడు.

- నెలకు సుమారు రూ.15 కోట్ల దందా
- 10 నుంచి 15 శాతం వడ్డీ వసూళ్లు
- తెల్ల పేపర్లు, ఓపెన్ చెక్కులపై సంతకాలు



ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: అవసరానికి అప్పు చేస్తున్న ప్రజలకు అది అనర్థాలకు దారితీస్తోంది. సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు పెద్ద ఎత్తున వడ్డీలకు ఇస్తూ అందినంత వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారం భారీగా కొనసాగుతోంది. వాహనాల యజమానులు వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు పెట్టి వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి వారికి సమయానికి అందకపోవడంతో చెల్లించడంలో జాప్యమైతే వాహనానికి వచ్చే మార్కెట్ రేటు కంటే అప్పు ఎక్కువ కావడంతో తాకట్టు పెట్టిన వారు తీసుకెళ్లడం లేదు. దీంతో వాహనాలను తాకట్టు పెట్టుకున్న వ్యక్తులు ఆ వాహనాలను అద్దెకిస్తూ సంపాదిస్తున్నారు.

ఓపెన్ చెక్కులు.. తెల్లపేపర్లపై సంతకాలు

డబ్బు అవసరమున్నవారు అప్పు తీసుకుంటున్న సమయంలో వ్యాపారులు ఓపెన్ చెక్కులు, తెల్లపేపర్లపై సంతకాలు తీసుకుంటున్నారు. చెల్లించేందుకు జాప్యం జరిగితే తమకు అధిక మొత్తంలో డబ్బులు బాకీ ఉన్నాడని చెక్కులు, పేపర్లు చూపిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. వాహన పేపర్లు తాకట్టు పెడుతున్న సమయంలో వాహనం మార్పు కోసం రవాణాశాఖకు అవసరమైన 29, 30 ఫారంపై కూడా ముందే సంతకాలు తీసుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇతర ప్రాంతాల్లో అద్దె

కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బులు తీసుకున్న వాహన యజమానులు సరైన సమయంలో బాకీ చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఆ వాహనాలను ఇతర ప్రాంతాల్లో అద్దెకిస్తూ నెలనెలా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదిస్తున్నారు. వాహన యజమానులు డబ్బు చెల్లించి వాహనాలు కావాలని కోరితే కొంత సమయం తీసుకుని తీసుకొస్తున్నారు. తాకట్టు పెట్టిన వారు తమ వాహనం దెబ్బతిందని వడ్డీ వ్యాపారులతో గొడవ పడుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీ వసూలు చేసినా.. వాహనాలు, బంగారం, భూములు తాకట్టు పెట్టుకుని అప్పు ఇవ్వడం చట్ట విరుద్ధం. అధిక వడ్డీ వసూలు చేసినా.. ఇబ్బందులకు గురిచేసినా.. డబ్బులు చెల్లించిన తర్వాత తిరిగి వాపస్ ఇవ్వకున్నా బాధితులు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై చర్యలు చేపడతాం.

– రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

రైతులు పంటల సరళి మార్చాలి



మాట్లాడుతున్న పొలాస ఏడీఆర్ శ్రీనివాస్

కథలాపూర్: వాతావరణానికి అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చాలని పొలాస వ్యవసాయ పరిశోధన సంచాలకుడు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కథలాపూర్‌లోని రైతు వేదికలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో 'గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమం' నిర్వహించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే రైతులకు లాభం వస్తుందన్నారు. యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుకర్, శ్రావణి, రాజేంద్రప్రసాద్, ఏవో యోగితా, ఏఈవో శేఖర్, హరీశ్, సంధ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు

మల్యాల(చొప్పదండి): ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన మల్యాల ముత్యంపేటలో చోటుచేసుకుంది. రాజస్థాన్ నుంచి గ్రానైట్ లోడ్‌తో కరీంనగర్‌వైపు వెళ్తున్న లారీ, పత్తి లోడుతో గుజరాత్‌కు వెళ్లేందుకు కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న లారీ మల్యాల మండలం ముత్యంపేట శివారులోని జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు లారీల ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, పత్తి లారీ డ్రైవర్ కె.వీరయ్య(28), గ్రానైట్ లారీ డ్రైవర్ దేవలాల్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఇద్దరు డ్రైవర్లతో పాటు పత్తి లోడు లారీలో ఉన్న మరో వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మల్యాల బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సురేశ్, హోంగార్డు సంపత్ సంఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీతో క్యాబిన్లలో ఇరుక్కున్న డ్రైవర్లను బయటకు తీసి 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆమె నేత్రాలు సజీవం


రాజేశ్వరి (ఫైల్)

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని పాతబజార్‌కు చెందిన నీల రాజేశ్వరి (70) గురువారం రాత్రి మృతి చెందగా..ఆమె కోరిక మేరకు శుక్రవారం ఆమె కుమారుడు నీల రమేశ్, కోడలు మాధవిలతలు నేత్రదానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు. కార్యక్రమంలో ఇంజినీర్ కోల అన్నారెడ్డి, చింతల కిషన్ పటేల్, కరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముక్క శరత్‌కృష్ణ, మ్యాడం శివకాంత్, బట్టు వినోద్ కుమార్, సుధాకర్ రెడ్డి, రాంబాబు, రజిత, శ్రీకాంత్, రజిని, నాగరాజు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

దాడి కేసు నిందితుల గుర్తింపు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు దుబ్బాక రమేశ్‌పై బుధవారం ఉదయం మోతె బైపాస్‌రోడ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి దాడిచేసి పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితులను గుర్తించారు. శుక్రవారం అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు సమాచారం. పథకం ప్రకారమే దాడి చేసినట్లు పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించినట్లు సమాచారం.

ఘనంగా గంగా హారతి



ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గంగాహారతి కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి గోదావరి నదికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- అనాథలుగా మారిన ఇద్దరు ఆడపిల్లలు


రమేశ్ మృతదేహం

హుజూరాబాద్: పట్టణంలోని సైదాపూర్ రోడ్డు క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన వకుళాభరణం రమేశ్(53) వృత్తిరీత్యా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న క్రమంలో ఓ కారు అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి వెనుకనుంచి ఢీకొట్టడంతో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా.. రమేష్ భార్య గతంలోని మృతిచెందగా, ఇప్పుడు ఇతని మరణంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆలయ ఆవరణలో భక్తుల సందడి


కోడె మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కేదారీశ్వరునికి కార్తీక దీపాలు

వేములవాడ: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీకదీపాలు వెలిగించారు. శుక్రవారం 25వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.40లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఇతర అధికారులు పరిశీలించారు.


దీపం వెలిగిస్తున్న మహిళ


రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో హైదరాబాద్‌కు చెందిన సురేఖరెడ్డి హరికథా గానం

వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన సురేఖరెడ్డి బృందం పాండవ రాజసూయ యాగం హరికథను గానం చేశారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఖాతాదారులు!

- క్రిమినల్స్ ఇచ్చే సొమ్ముకు ఆశపడుతున్న జిల్లావాసులు
- ఒక్కో అకౌంట్‌లో రూ.2 కోట్ల - రూ.3 కోట్ల వరకు జమ
- ఆ తర్వాత మరో ఖాతాకు బదిలీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- జగిత్యాలలో 16 నెలలుగా కొనసాగుతున్న దందా
- క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని కటకటాల పాలవుతున్న కస్టమర్లు


సైబర్ నేరగాళ్లు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకు చెందిన కొందరు కస్టమర్లు సైబర్ నేరగాళ్లు ఇచ్చే సొమ్ముకు ఆశపడి తమ ఆధారాలన్నీ ఇచ్చేస్తున్నారు. వీటి ఆధారంతో దుండగులు ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. తాము కొట్టేసిన సొమ్మును అందులో జమ చేస్తున్నారు. వెంటనే వేరే అకౌంట్లకు మళ్లిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా సుమారు 16 నెలలుగా ఈ దందా పెద్దఎత్తున సాగుతోంది.

వెల్గటూరుకు చెందిన ఇద్దరి పాత్ర..

జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్థానిక బీట్‌బజార్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. పట్టణంలోని కొందరికి డబ్బు ఆశచూపి మచ్చిక చేసుకుంటున్నారు. ముంబాయిలోని ప్రధాన కార్యాలయాల ఉద్యోగులతో మాట్లాడి.. స్థానికంగా లావాదేవీలు జరిపే రెండు ప్రైవేటు బ్యాంకుల్లో ఆధారాలు ఇచ్చిన వారిపేరిట ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఖాతా తెరిచే సమయంలోనే ఆధారాలు ఇచ్చే వ్యక్తి మొబైల్ నంబరును లింక్ చేస్తున్నారు. మరుసటి రోజే ఆ ఫోన్‌నంబరు మార్చి ఇంకో మొబైల్‌నంబరు లింక్ చేస్తున్నారు. ఫలితంగా ఏటీఎం కార్డు, పాస్‌వర్డ్ సైతం వారి చేతికే చిక్కుతున్నాయి. దీంతో ఖతాదారుకు తెలియకుండానే ఒక్కో అకౌంట్ నుంచి నెలకు కనీసం రూ.2 కోట్లు - రూ.3 కోట్ల లావాదేవీలు చేస్తున్నారు. ఒక్కోసారి తమ అకౌంట్‌లో కొంత సొమ్ము జమచేస్తున్న కస్టమర్లు.. తమ ఫోన్‌నంబరుకు మెసేజ్ రాకపోవడంతో బ్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

వెలుగులోకి ఇలా..

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రముఖుని బ్యాంకు ఖాతా నుంచి జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రమేశ్, జగిత్యాలకు చెందిన అల్లె సత్యం బ్యాంకు ఖాతాల్లో కొంత సొమ్ము జమైంది. ఈ సొమ్మును కస్టమర్లకు తెలియకుండానే పుణెకు చెందిన మరో వ్యక్తి బ్యాంకు ఖాతాలోకి సైబర్ నేరగాళ్లు మళ్లించారు. విచారణ చేపట్టిన ఉత్తరప్రదేశ్ పోలీసులు.. బుధవారం ఇద్దరు బ్యాంకు ఖాతాదారులను అదుపులోకి తీసుకుని ఆ రాష్ట్రం తీసుకెళ్లారు. ఈ విషయం తెలియడంతో వివరాలు, బ్యాంకు పాసు పుస్తకాలు, ఫోన్‌నంబర్లు ఇచ్చిన కొందరు ఆందోళన చెందుతున్నారు.

విచారణ చేపడతాం



జగిత్యాలలో సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఫోన్‌నంబర్లు ఇచ్చి మోసపోయిన వారు ఎవరైనా ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. నిందితులను గుర్తించి తగిన చర్య తీసుకుంటాం. బ్యాంక్ ఖాతాల పైనా విచారణ జరుపుతాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ

జాతీయ కరాటే పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న శ్యామలాదేవి, పక్కన సినీ నటుడు సుమన్, హరిశంకర్

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో రెబల్ స్టార్ కృష్ణంరాజు మెమోరియల్ కప్–2024 జాతీయ కరాటే పోటీలను శుక్రవారం కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, సినీ నటుడు సుమన్ ప్రారంభించారు. సుమన్ మాట్లాడుతూ.. చిన్న పిల్లలపైనా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, విద్యార్థినులు, యువతులు కరాటే నేర్చుకొని, ఆకతాయిలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. శ్యామలాదేవి మాట్లాడుతూ.. కరాటే మానసికోల్లాసం, ఆత్మవిశ్వాసానికి దోహదం చేస్తుందని తెలిపారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకునేందుకు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌కేవ చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, చైర్మన్ వసంతకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్, సాయికుమార్, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, నిర్వాహకుడు శ్రీనివాస్, సీనియర్ మాస్టర్ సురభి వేణుగోపాల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నా భర్తను రప్పించండి

- ఖలీఫా ప్యాలెస్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు
- మల్లాపూర్ మహిళ వేడుకోలు
- హైదరాబాద్ ప్రవాసీ ప్రజావాణిలో వినతి


వినతిపత్రం అందిస్తున్న మంజుల

బోయినపల్లి(చొప్పదండి): అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ బహ్రెయిన్‌లో మగ్గుతున్న తన భర్తను స్వదేశానికి రప్పించాలని రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన మంజుల అధికారులను వేడుకుంది. హైదరాబాద్ ప్రవాసీ ప్రజావాణిలో శుక్రవారం వినతిపత్రం అందించింది. మంజుల తెలిపిన వివరాలు. తన భర్త నర్సింలు ఓ ఏజెంట్ మాటలు నమ్మి సెక్యూరిటీగార్డు ఉద్యోగమని రూ.3లక్షలు అప్పుచేసి 9 నెలల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లాడు. తీరా అక్కడికెళ్లాక అది విసిట్ వీసా అని సెక్యూరిటీగార్డ్ ఉద్యోగం కాదని తెలిసింది. అంతేకాకుండా సదరు ఏజెంట్ నర్సింలును అక్కడి రబ్బా ప్రాంతంలోని ఓ ఖలీఫా ప్యాలెస్‌లో లేబర్ పనులకు నియమించాడు. ఈ విషయాన్ని నర్సింలు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలిపాడు. కొద్ది రోజుల తర్వాత అనారోగ్యం బారిన పడ్డాడు. అయినా బలవంతంగా పనులు చేయిస్తున్నారని నర్సింహులు ఏడుస్తూ ఫోన్‌లో భార్య మంజులకు తెలిపాడు. దీంతో మంజుల హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణి సెల్‌లో శుక్రవారం వినతిపత్రం ఇచ్చింది. నర్సింహులును రప్పించే విషయంలో విదేశీ వ్యవహారాలశాఖ అధికారులతో మాట్లాడి స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని అధికారులు చెప్పినట్లు మంజులతో వెళ్లిన సింగిల్‌విండో చైర్మన్ దుర్గారెడ్డి తెలిపారు.

రుణమాఫీ కాలేదు.. విత్తనాల జాడలేదు

- అందని రైతుబంధు.. కానరాని పంట డబ్బులు
- అన్నదాతకు నలుదిక్కులా సమస్యలే
- యాసంగి సాగుపై సందిగ్ధం



కరీంనగర్ అర్బన్: యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులను సమస్యలు నీడలా వెంటాడుతున్నాయి. సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతుండగా రైతుబంధు జమకాకపోగా, రుణమాఫీ పూర్తవకపోగా, రాయితీ విత్తనాల ఊసే లేదు. యాంత్రీకరణ పథకం పడకేయగా పండించిన ధాన్యాన్ని విక్రయిస్తే డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు కొర్రీలు పెడుతుండగా కూరగాయలు సాగు చేసేవారికి ప్రోత్సాహం కరువైంది.

రైతుబంధు.. పంట డబ్బులేవి?

అన్నదాతకు ఆర్థిక భరోసాగా ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తుండగా ఇంకా అతీగతి లేదు. వానాకాలం రైతుబంధు విడుదల చేయకపోగా యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం అందలేదు. ఏటా ఎకరాన రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.15వేల విధానం నేటికి ఆచరణకు నోచుకోలేదు. జిల్లాలో గత సంవత్సరం యాసంగి సాగులో 1.61లక్షల మంది రైతులకు గానూ 1.47 లక్షల మందికి రూ.150కోట్లు విడుదల చేశారు. సాగు చేయబడే విస్తీర్ణానికే రైతుబంధు ఉంటుందని సీఎం, మంత్రులు ప్రకటించగా వానాకాలం నుంచి రైతుబంధు జాడ లేదు. ఇక ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంట కొనుగోలు చేసిన 48గంటల్లోనే నగదు ఖాతాకు చేరుతుందని ప్రభుత్వం ప్రకటించగా క్షేత్రస్థాయిలో మాత్రం విరుద్ధ పరిస్థితి. వారం రోజులు దాటినా డబ్బులు పడటం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో రూ.కోట్లలో రైతుల ఖాతాకు చేరాల్సి ఉంది. త్వరితగతిన ఖాతాకు నగదు మళ్లిస్తే పెట్టుబడికి ఆసరాగా ఉంటుంది.

రుణమెప్పుడో..?

సకాలంలో రుణాలివ్వాల్సిన బ్యాంకర్లు కొర్రీలతో వేధిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఏటా రుణ ప్రణాళికను రూపొందిస్తుండగా లక్ష్యాన్ని చేరుకున్న దాఖలాలే లేవు. రుణమాఫీ పరిపూర్ణం కాకపోవడం ఇంకా లబ్ధిదారుల సేకరణలో బ్యాంకర్లు తలమునకలవడం విశేషం. మంత్రుల సమీక్షలో రుణాలిస్తామని తలలూపడం తప్పా ఆచరణలో అదే నిర్లక్ష్యం. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ ప్రకటించగా చాలామందికి మాఫీ కాలేదు. సాంకేతిక కారణాల పేరుతో జాప్యం చేస్తుండగా ఇదే అంశాన్ని ఆసరాగా చేసుకున్న బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు దాటవేత ధోరణి అనుసరిస్తున్నారు.

అవసరం కొండంత.. ఆసరా గోరంత

ఏటా అరకొర విత్తనాలు మాత్రమే సరఫరా అవుతుండగా ప్రధానంగా అవసరమైన వరి విత్తనాలను ఆశించినస్థాయిలో ఇవ్వడం లేదు. వేరుశనగ, కందులు, శనగ, మినుములు, పెసలు ఇతర విత్తనాలు ఆన్‌లైన్ ద్వారా పంపిణీ చేయాల్సి ఉండగా ఇంకా విత్తనాలే రాకపోవడం ఆందోళనకర పరిణామం. ఏటా పంపిణీ చేసే విత్తనాలు క్షేత్రస్థాయి డిమాండ్‌కు ఏ మాత్రం సరిపోవడం లేదు. పరిశోధనస్థానాలు గానీ విత్తనాభివృద్ధి సంస్థలు విత్తనాల నిల్వలపై ప్రచారం లేకపోవడం శోచనీయం.

యాంత్రీకరణ అటకెక్కినట్టేనా.?

రైతులను ఆధునిక సాగు వైపు మలిచేలా చర్యలుండాల్సి ఉండగా చేయూత లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. 2012 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో యాంత్రీకరణ పథకం అమలులో ఉండగా ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు రాయితీపై ఇచ్చేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకతో యాంత్రీకరణ పథకానికి స్వస్తి పలికారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా మళ్లీ సదరు పథకం తెరపైకి వచ్చింది. నిధులు కేటాయించడంతో రైతులను సాంకేతిక సాగు వైపు మళ్లిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. ప్రకటనల వరకే తప్పా ప్రగతిలో లేదని రైతులు వాపోతున్నారు.

70 కిలోల కాపర్‌వైర్ పట్టివేత

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని 70 కిలోల కాపర్‌వైర్‌ను సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఏరియా సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఆదేశాలతో జూనియర్ ఇన్‌స్పెక్టర్లు ఉమేశ్, అక్బర్‌అలీ, ఇంటిలిజెన్స్ టీం రాధాకృష్ణ, తిరుపతితో కలిసి విఠల్‌నగర్‌లో ఓఇంటి వద్ద తనిఖీ చేయగా 70కిలోల కాపర్‌వైర్ లభించింది. ఇది సింగరేణి కంపెనీకి చెందినదిగా నిర్ధారించారు. అక్కడే ఉన్న అనుమానితులను ప్రశ్నించగా ఏరియా వర్క్‌షాప్ నుంచి చోరీ చేసినట్లు తెలిపారు. అనుమానితుల్లో నలుగురు పట్టుబడగా, ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన నిందితుల్లో మహేశ్, సురేశ్, రాజు, రవి ఉన్నారు. వీరితోపాటు కాపర్‌వైర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు వివరించారు. పట్టుకున్న కాపర్‌వైర్ విలువ సుమారు రూ.42వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఏఎల్ నాయకులు

కరీంనగర్‌క్రైం: భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈనెల 30, డిసెంబర్ 1న హన్మకొండలో నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర నాయకుడు మర్రి వెంకటస్వామి తెలిపారు. ఈమేరకు కరీంనగర్ జిల్లా కోర్టులో శుక్రవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాదుల రక్షణకు చట్టాలు తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రతీ నెల రూ.5వేలు స్టైఫండ్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులను రూ.10లక్షలకు పెంచాలని, హౌసింగ్ సొసైటీ కింద ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. హనుమకొండలో నిర్వహించే మహాసభల్లో న్యాయవాదాల డిమాండ్లు నెరవేర్చుకునేందుకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ, మురహరి రావు, బాలకృష్ణారావు, లక్ష్మణ్‌రావు, వేణుగోపాల్, న్యాయవాదులు వివేకానంద, శంకరయ్య, రేణుక, మహేందర్, ఆంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

వసూల్ రాజా!

- రూ.2 లక్షలిస్తేనే ఒకే.. లేదంటే కొర్రీలే
- రా మిల్లు నుంచి బాయిల్డ్ మారాలంటే ఇంతే
- తలనొప్పిగా టాస్క్‌ఫోర్స్ అధికారి వ్యవహారం
- ఉమ్మడి జిల్లాలో ఇదో దందా

కరీంనగర్ అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తు పలువురు టాస్క్‌ఫోర్స్ అధికారుల వ్యవహారం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపుతోంది. రా రైస్ మిల్లుల నుంచి బాయిల్డ్ రైస్‌మిల్లులకు మారేందుకు మిల్లర్లు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అధికారిక అనుమతులు అవసరం కాగా సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ పేరిట మామూళ్ల వేట మిల్లర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అసలే అప్పులతో బాయిల్డ్ మిల్లుకు మారుతున్నవారు కొందరు కాగా.. కొత్తగా బ్యాంకు రుణాలతో మిల్లులు ఏర్పాటు చేసుకున్నవారు మరికొందరు.

కప్పం కట్టాల్సిందే

రా రైస్ మిల్లులతో ఇబ్బందులుండటంతో పలువురు బాయిల్డ్ మిల్లుకు మారుతున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మిల్లర్లలో పావు వంతు ఇదే ఆలోచన. రా మిల్లుతో క్వింటాల్‌కు 67కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా నూక ఎక్కువగా వస్తోంది. మిల్లర్లకు లాభసాటి లేకపోవడంతో బాయిల్డ్‌కు మారుతున్నారు. బాయిలర్లు, కుండీలు, పొగ గొట్టాలు, ఇతర పరికరాలను బిగించుకున్నారు. కొత్త మిల్లులు కూడ ఏర్పాటవుతుండగా అనుమతులకు దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో కాలుష్య నియంత్రణ మండలి, వరంగల్ బోర్డు నుంచి అనుమతులు తీసుకోగా బాయిల్డ్ మిల్లుకు అనుమతించాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు దరఖాస్తు చేశారు. జిల్లా అధికారులు సర్టిఫై కోసం సివిల్ సప్లయ్ కమిషనర్‌కు నివేదించగా సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేసి సర్టిఫై చేయాల్సి ఉంటుంది. సదరు అవకాశాన్ని ఆసరా చేసుకున్న బృందంలోని పలువురు అధికారులు అక్రమ సంపాదనకు రుచి మరిగారు. దరఖాస్తు చేసుకున్న మిల్లర్ల ఫోన్ నంబర్లను సేకరించి బేరంరసారాలకు దిగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఫైల్ కదలదంటున్నారు.


కొత్త అధికారులే కీలకం

టాస్క్‌ఫోర్స్ బృందంలో పదవీ విరమణ పొందిన విశ్రాంత ఎస్పీతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలను తీసుకుంటారు. విశ్రాంత ఎస్‌ఐల్లోని వ్యక్తులే ఈ రకం దందాకు తెరలేపినట్లు సమాచారం. వాస్తవానికి సర్టిఫై ఇవ్వడానికి సదరు అధికారులకు సంబంధం లేదు. అయినా ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యంగా మామూళ్లను డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తప్పుదారి పట్టిస్తున్నారని మిల్లర్లు వాపోయారు. గతంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులే అనుమతులు ఇవ్వగా అకున్ సబర్వాల్ సివిల్ సప్లయ్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ సర్టిఫై తప్పనిసరని జీవో జారీ చేశారు. అప్పటి నుంచి హైదరాబాద్ అధికారులే అనుమతులకు కీలకమయ్యారు.

రేషన్ బియ్యం దందాలోనూ లీకులు

రేషన్ బియ్యం దందాకు సైతం కొందరు అధికారులు ఆజ్యం పోస్తున్నారు. రేషన్ అక్రమ దందాను అడ్డుకోవాల్సింది పోయి అక్రమార్కులకు సమాచారం చేరవేయడంలో ముందుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో రేషన్ కింగ్‌పిన్‌లుగా వ్యవహరిస్తున్నవారికి టాస్క్‌ఫోర్స్ బృందం వస్తుందంటే చాలు ఇట్టే తెలిసిపోతుంది. సదరు విశ్రాంత ఎస్‌ఐ సమాచారం ఇస్తుండటంతో అక్రమార్కుల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. కాగా..వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదని సివిల్ సప్లయ్ అధికారులు వివరించారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై భక్తులతో ప్రయాణిస్తున్న ట్రాలీఆటో శుక్రవారం ప్రమాదానికి గురైంది. మందమర్రికి చెందిన 12మంది భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా ట్రాలీ ఆటోలో గుట్టపైకి వెళ్లారు. అంజన్నను దర్శించుకుని ఆటోలో ఘాట్‌రోడ్డు దిగుతున్నారు. ఆటో న్యూట్రల్‌లో వెళ్లగా బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. గతంలో బస్సు ప్రమాదం జరిగిన స్థలంలో నిర్మించిన సైడ్‌వాల్‌కు, కరెంటు పోల్‌కు ఆటో ఢీకొని బోల్తా పడింది. గమనించిన స్థానికులు జేసీబీ సాయంతో ఆటోను పైకి లేపారు. అందులో ప్రయాణిస్తున్న సుమారు 12మందికి గాయాలు కాగా.. జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సైడ్‌వాల్ లేకుంటే పెను ప్రమాదం సంభవించేదని పేర్కొన్నారు.

ఉత్తమ నటిగా 'పారమిత' విద్యార్థిని



కరీంనగర్: సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ పోటీల్లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటకంలో ఉత్తమ నటిగా 10వ తరగతి చదువుతున్న నాగజైత్ర ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అమితేశ్వర్, అర్జున్, సంప్రీతి, శ్రీనిధి, సమీక్ష, సుహృత, అనుశ్రీ, నాగజైత్రను పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, ప్రాచీ, రశ్మిత, అనుకర్‌రావు పాల్గొన్నారు.